

# రోగాలు - అనురోగాలు

## - డా.కె.వివేకానంద మూర్తి



*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*




'**ఇప్పుడు గుర్తు** పట్టడం కష్టమేలే,' - బాలరాజు అన్నాడు.

'చాలా యేళ్లయింది. అప్పుడు నేను కుర్రాణ్ని. ఇప్పుడు యెదిగాను. అయినా నువ్వు అందరి పేషెంట్స్‌తో నీచంగానే ప్రవర్తిస్తావు. విడిగా నేనెందుకు గుర్తుంటాను?

'పేషెంట్స్ మీద డాక్టర్‌కి కంట్రోల్ వుండాలి. లేకపోతే వాళ్లే మనకి యేం చెయ్యాలో చెప్తారు. అయినా నేను చేసేదంతా వాళ్ల ఆరోగ్యం కోసమే' అన్నాడు నాగదాసు.

'కమ్యూనికేషన్‌తో రోగి తొంభై శాతం కోలుకుంటాడని గ్రేట్ డాక్టర్ ఆస్లర్ చెప్పాడు. ఆ సూత్రం నీ రొటీన్లో లేదు. నీలాంటి రాతి గుండె వాడికి చెప్పినా అర్థం కాదు.'

'నేను నీకు చాలా సీనియర్ని. ఎంతో అనుభవంగలవాడిని. నువ్వు నేర్చుకోవాల్సింది యెంతో వుంది.'

'నేర్చుకోవడమంటే అమాయకులైన యీ మనుషుల ప్రాణాలతో చట్ట విరుద్ధంగా రీసెర్చి ఆట ఆడుకోవడమా?'

'ఈ మందు యెంతో మందికి అందుబాటులోకి వచ్చాక నీకు తెలుస్తుంది, ఎన్నివేల మంది డయాబెటిక్స్ చావుని జయించి హాయిగా ఆరోగ్యంగా వుంటారో. నేను చేసేది చట్ట విరుద్ధమైన రీసెర్చి కాదు. ప్రాణదానం. అశేష ప్రజానీకానికి వూపిరి పోసే గ్రేట్ ఇన్వెన్షన్. మనం కలిసి పనిచేస్తే అతి త్వరలో అనుకున్నది సాధిస్తాం.'

'ఎన్నో వేలమందికి ప్రాణదానం అంటున్నావ్. మరి యిక్కడ వీళ్ల ప్రాణాల సంగతి?' బాలరాజు అడిగాడు.

'వారానికి యిద్దరు, ముగ్గురు పోతున్నారు. వీళ్లకీ బ్రతికే హక్కుంది. వీళ్లూ మనుషులే' రేఖ అంది.

'వీళ్లకి యేం జరుగుతోందో తెలియదు. తెలియకుండానే నీ చేతిలో తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు' బాలరాజు కోపంగా అన్నాడు.

‘అవతల వేల ప్రాణాలు నిలబడుతున్నప్పుడు, యిద్దరు, ముగ్గురు పోతే నష్టం యేం లేదు. ఒక గొప్ప పని సాధించాలంటే యీపాటి త్యాగం వో లెక్కలోది కాదు‘ అన్నాడు నాగదాసు.

‘నీ ఆలోచనలు, మా ఆలోచనలు కలవ్వు మావయ్యా‘ అంది రేఖ.

‘నీ రీసెర్చి నువ్వు చెయ్యి. మేం చేసేది మేం చేస్తాం‘ అన్నాడు బాలరాజు.

‘బాగా ఆలోచించుకోండి. తొందరపడితే పరిణామాలు యెలా వుంటాయో మీకు అయిడియా లేదు.‘

‘భయపెడుతున్నావా? ఇప్పుడు పరిణామాల గురించి ఆలోచించుకోవాల్సింది నువ్వు. అంచేత నువ్వు తొందరపడితే మంచిది.‘ నిర్ధారిస్తూ చెప్పాడు బాలరాజు.

కాసేపు ముగ్గురి మధ్యా నిశ్శబ్దం.

బాలరాజు, రేఖ దూసుకుంటూ అక్కణ్నించి వెళ్లిపోయారు. నాగదాసు వెళ్లిపోతున్న వాళ్లను వెనుకనుంచి చూస్తూ విషపునవ్వు నవ్వు నవ్వుకున్నాడు. తన నవ్వు విషపు నవ్వని నాగదాసుకి తెలియదు.

క్వాలిటీ రెస్టారెంట్‌లో అలలవైపు డెక్ మీద అంతా కూర్చున్నారు. బాలరాజు, రేఖ, చాముండేశ్వరి, మందాకిని, హిస్టరీ శర్మగారు, పాహియాన్ - పెద్ద మీటింగే.

‘నాకీ యిసయం తెల్నే తెల్దు‘ అంది చాముండేశ్వరి.

‘గొప్ప రివలేసనైపోనాది నాకు‘ అంది మందాకిని.

‘జనాల్ని సంపేత్తన్నాడు ఆణ్ని సంపీసెయాల్సిందే‘ అందించాము.

పాహియాన్‘ ఐస్క్రీమ్ చెప్పనా మీకు చాముగారూ‘ అన్నాడు ఆమె యెత్తు పల్లాలకేసి చూస్తూ.

‘సెప్పవోయ్ సైనా మాంత్రికుడా‘ అంది చిలిపిగా చాము.

‘గో ఎ హెడ్ బాలూ నేనెప్పుడు నీతోటే‘ అంది రేఖ.

‘వెంటనే యీ దారుణానికి ఫుల్‌స్టాప్ పెట్టేయాల్సిందే‘ అన్నారు హిస్టరీ శర్మగారు.

‘కానీ వాడు దేవాంతకుడు మీరిద్దరూ జాగర్త‘ అని హెచ్చరిక చేశారు కూడా.

‘అంతా ఆలోచించాను‘ అన్నాడు బాలరాజు కాఫీ తాగడం పూర్తిచేసి.

‘మా డాట్రుగారు యేం జేసినా నికార్సుగానే వుంటది‘ మందాకిని కచ్చితంగా చెబుతున్నానన్నట్టు చెప్పింది.

ఆ సాయంత్రపు చల్లటి సముద్రం గాలుల్ని అంతా హాయిగా పంచుకున్నారు. మరో కాస్సేపు కబుర్లతో గడిపి అంతా లేచారు. పాహియాన్ చాముండేశ్వరిని దూరంగా యిసుకలోకి తీసుకువెళ్లి యిష్టంగా మాట్లాడుతున్నాడు. హిస్టరీ శర్మగారు పదో నెంబరు బస్సు వస్తోంది నే కదుల్తా అని లేచారు. ‘నానూ మీతోపాటే‘ అంటూ మందాకిని కూడా కదిలింది. బాలరాజు, రేఖ బాచిలర్స్ డెన్ వేపు బీచ్‌లో నడిచారు. నల్లతంబి వంట చేశాడు. ఇద్దరూ బాల్కనీలో కూర్చుని భోంచేశారు. తర్వాత బాలరాజు మంత్రి భానురావిగారిచ్చిన ప్రైవేట్ నెంబరుకి ఫోన్ చేశాడు. భానురావుగారు లైన్లోకొచ్చారు. బాలరాజు అంతా వివరించాడు.

‘మిగతా సంగతి నాకొదిలెయ్ నువ్వు నిశ్చింతగా వుండు‘ అని భానూరావుగారు బాలరాజుకి హామీ యిచ్చారు.

మర్నాడే క్యూర్ హాస్పిటల్లో ఎంక్వయిరీ ప్రారంభమైంది. అరడజనుమంది అధికారులు, పోలీసు వున్నతాధికారులు వచ్చి హాస్పిటల్ రికార్డ్సు అన్నీ పరిశీలిస్తూ అందర్నీ రకరకాల ప్రశ్నలడుగుతూ హడావుడి చేశారు. ఇదంతా తెలిసినట్టుంది. నాగదాసు హాస్పిటల్‌కి రాలేదు. జరగాల్సిన ఆపరేషన్లు వాయిదాపడ్డాయి.

హెల్త్ సెక్రటరీ బాలరాజు, రేఖలతో ఫోన్లో మాట్లాడాడు. హాస్పిటల్‌కి రమ్మని తర్వాత పర్సనల్‌గా కూడా కలిశాడు. ఎంక్వయిరీకి మరింత సమాచారం తీసుకున్నాడు.

నాగదాసు యిక క్యూర్ హాస్పిటల్‌కి రాడనీ యిక మీదట అతనికి హాస్పిటల్‌తో ఏ సంబంధం వుండబోదనీ తెలియబరిచాడు. అన్నీ తేలేదాకా బాలరాజు, రేఖ క్యూర్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ వ్యవహారాలు, పేషెంట్స్ చికిత్సా సదుపాయాలు అన్నీ చూసుకోవాలని ప్రభుత్వం తరఫున మాట్లాడి ఖరారు చేశాడు.

ఆ మధ్యాహ్నం నాగదాసు, మందాకినికి యింటికి వచ్చి కలవమని కబురు పెట్టాడు.

మందాకిని వెళ్లి నాగదాసుని చూసింది. ఆమె వెళ్లేసరికి నాగదాసు, సినిమాలో పెద్ద విలన్ రౌడీలకు ఆర్డర్లిస్తున్నట్టు, తన పనివాళ్లకి, పనివాళ్లలా కనిపించే రౌడీలకు, రౌడీల్లా కనిపించే పనివాళ్లకు ఆదేశాలిస్తున్నాడు. మందాకిని వెళ్లగానే తన రౌడీల మీటింగు ఆపి, వాళ్లని వెళ్లమని ఆమెను పిలిచాడు. రౌడీలు పక్కగదిలోకి వెళ్లి మందాకిని ఏం చెబుతుందోనని పొంచి వింటున్నారు.

'ఏం జరుగుతోందక్కడ?' అనడిగాడు నాగదాసు.

'ఏటుంటదండి. తవకి తెలిసేవుంటది. ఎల్తు మినిస్టిగారి మంద ఆసిపిటల్ పేగుల్లెక్కడుతున్నారు. తవరింక అటొత్తారో లేదో అనుమానమేనండి.' అంది మందాకిని అతని యెదురుగా సోఫాలో రాణీలా కూర్చుంటూ.

'ఇదంతా ఆ బాలరాజుగాడి పనే. మా రేఖని కూడా వల్లో వేసుకున్నాడు. వాడికి మూడింది' అన్నాడు నాగదాసు.

'ఏటండి మూడేది. ఆయనకి మినిస్టిగారి సపోర్టు. రాజు తల్చుకుంటే దెబ్బలకి కొదవా? మంత్రిగారు తల్చుకుంటే మర్డర్లకి లివిటా' చెప్పింది మందాకిని.

'అంతదాకా యెందుకు? నాలుగు తగిలిస్తే నోరెత్తడు'

'మీ దెబ్బలు వూరంతా యినబడతాయి. మంత్రిగారు కొడితే సడీ సప్పుడూ వుండదు. మళ్లీ లేవరు' మరోసారి వాత పెట్టినట్టు చెప్పింది మందాకిని.

నాగదాసు నోట మాటలేదు. కాస్త నిశ్శబ్దం తర్వాత 'నే యెల్తా' అని మందాకిని లేచి వీధిలో కొచ్చేసింది.

కాస్సేపటికి నాగదాసు తేరుకుని రౌడీల కోసం అరిచాడు. కానీ యెవరూ రాలేదు. చాటునుండి అంతా విన్న రౌడీలు అప్పటికే జారుకున్నారు. నాగదాసుకి తన సామ్రాజ్యం కూలిపోతునట్టుగా అనిపించి, వొక్కసారి కుర్చీలోంచి లేచి అంతలోనే కుప్పకూలిపోయాడు. అవాళ అతడికి అన్నం హితవు కాలేదు. ఆ రాత్రి నిద్ర అసలు రాలేదు. మర్నాడు పోలీసులు అరెస్టు వారెంట్‌తో నాగదాసు కోసం వచ్చారు కానీ అతడు కనబడలేదు. అతని గుమాస్తా పోలీసుల నోట్లో నోట్లు కూరి సాగనంపాడు. మళ్లా నాగదాసు పేరుగానీ, ప్రసక్తిగానీ యెక్కడా వినబడలేదు. అతడు వుండే యిల్లు రేఖదైపోయింది. దేశంలో పవరుంటే చట్టాలన్నీ చుట్టాలయిపోతాయి.

క్యూర్ హాస్పిటల్లో దొంగ రీసెర్చి వార్డు మూసేసారు. బాలరాజు, రేఖ యాజమాన్యంలో హాస్పిటల్ వున్నత ప్రమాణాలతో సేవలందిస్తోంది. మందాకిని 'క్యూర్'కి సూపరింటెండ్ అయింది. చాముండేశ్వరి యంత్రాంగానికి యిన్ ఛార్జ్‌గా ఛార్జ్ తీసుకుంది. ఓ రోజు పాహియాన్ చాముండేశ్వరిని కలవడానికి వచ్చాడు.

'నువ్ కూడా వొచ్చెయ్. ఇక్కడ మాతోపాటు పన్జేయచ్చు.' అంది చాముండేశ్వరి.

'బలేదానివే. టేకవేని నమ్ముకున్నాను. టేకవే నన్ను నమ్ముకుంది. నీకు రోజూ మంచి ఫుడ్డు పెట్టాలిగా నేను. అంచేత నన్నిలాగే వుండనీ. నన్ను లాగేసుకుంటూ వుండిపో' అన్నాడు పాహియాన్.

'అనుమానం లేదు. మనవెప్పుడూ యిడిపోని జంటే' అంది ప్రేమగా చాముండేశ్వరి.

రోజులు గడుస్తున్నాయి. రోగాలు గతిస్తున్నాయి. రోగులు వూపిరి తీసుకుంటున్నారు.

హిస్టరీ శర్మగారు వొకరోజు బాలరాజుని పిలిచి చెప్పారు. అన్నీ సర్దుకున్నాయి ఇక నువ్వు పెళ్లి చేసుకుంటే బావుంటుంది' అని.

'నేనూ అదే అనుకుంటున్నాను. రేఖా, నేనూ మాట్లాడుకుని త్వరలోనే డేట్ ఫిక్స్ చేసుకుంటాం' అన్నాడు బాలరాజు.

విశాలమైన యింట్లో బాలరాజు, రేఖ విహంగాలు ఆకాశంలో విహరిస్తున్నట్టు తిరుగుతున్నారు. బాలరాజు బాచిలర్స్ డెన్ ఖాళీ చేసి వచ్చేసాడు. నల్లతంబి కూడా కూడానే వచ్చాడు. తానీషా కలిసి చాలా రోజులైంది. తను యిక్కడికి మారాననీ, వస్తే తానీషాకు, హసీనా బేగంకి కూడా సదుపాయాలన్నీ వున్నాయనీ, యెప్పుడు కావలిస్తే అప్పుడు రావచ్చనీ కబురు పెట్టాడు. లంకంత యిల్లు. హిస్టరీ శర్మగారిని కూడా 'వొక్కరూ యెందుకు - మాతో వుండండి' అని ఆయనకు వొక ప్రత్యేకమైన గది యేర్పాటు చేసి పిలిచాడు. మూడంతస్తుల భవనం. గదులకేం లోటు లేదు. చుట్టూ పెద్ద గార్డెను. వెనుక వైపు మరీ విస్తృతంగా వుంది. గార్డెన్ మధ్యలో అందమైన కొలను. కొలనులో చెదురుమదురుగా కళకళలాడుతున్న అందమైన పువ్వులు. బాలరాజు, రేఖ కొలను గట్టుమీద కూచున్నారు. రేఖ యేదో ఆలోచిస్తోంది.

'మావయ్యని మిస్ అవుతున్నావా?' అడిగాడు బాలరాజు.

'ఛ.ఛ. శని విరగడైందని స్వేచ్ఛగా ఫీల్ అవుతున్నాను. మావయ్య యింత రోగ్ అని యెప్పుడూ వూహించలేదు. అయ్యో! అనుకోడానికి అంత అభిమానాన్ని తనెప్పుడూ నాపట్ల చూపించలేదు. అయినా అమాయకుల్ని చంపే క్రూరమృగంతో అనుబంధాలెందుకుంటాయ్ అయామ్ హేపీ.' అంది రేఖ కొలనులో నీళ్లు కెలుకుతూ.

'నువ్వు తెలిసావు కాబట్టి, యీ ఘోరం తెలుసుకునే అవకాశం కలిగి ఆపగలిగా' అన్నాడు బాలరాజు.

'అవును. నువ్వు తెలిసావు కాబట్టి' అంటూ రేఖ గలగలా నవ్వింది. ఆమె నవ్వుకి గాలి కదిలి కొలనులో అలలు కొంచెం కదిలాయి. పువ్వులు తలలూపాయి.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

